సాయిబాబా విగ్రహావిష్కరణ



ఆవిష్కరించిన నూతన సాయిబాబా విగ్రహం

శంషాబాద్: ధర్మగిరి దేవాలయంలో గురువారం సాయిబాబా నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. అన్నప్రసాద మండపానికి ఎదురుగా కొత్తగా ఏర్పాటు చేసిన బాబా విగ్రహావిష్కరణ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా పల్లకి సేవ, హారతి కార్యక్రమాల అనంతరం పెద్ద ఎత్తున భక్తులకు అన్నదానం చేశారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకురాలు ధరణమాత, ఆలయ నిర్వాహకులు శివదత్తసాయితో పాటు శంషాబాద్ పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

కోటలో విదేశీయుల సందడి

గోల్కొండ: ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోటకు గత నెల రోజుల నుంచి పర్యాటకుల తాకిడి విపరీతంగా పెరిగింది. తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు కోటను చూడడానికి భారీ సంఖ్యలో తరలి వస్తున్నారు. గత వారం రోజులుగా కోటకు వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య కూడా పెరిగింది. విదేశాల నుంచి వచ్చే పర్యాటకులు కోటలోని క్లాపింగ్ పోర్టికో, రాణి మహల్, భక్త రామదాసు చరసాల, కోటలోని ఫిరంగులను ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ప్రమాదాలకు నిలయంగా మూలమలుపు

- అక్కడ తరుచూ ప్రమాదాలు
- నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్న స్థానికులు

మైలార్‌దేవ్‌పల్లి: కొన్ని మూలమలుపు రహదారుల ద్వారా అనేక ప్రమాదాల చోటు చేసుకుంటున్నాయి.ఎదురుగా ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ ఎర్రకుంట సమీపంలో ఓ ప్రధాన రహదారి మూల మలుపు ప్రమాదకరంగా మారింది. మధుబన్ కాలనీ నుంచి శ్రీరామ్‌కాలనీకి వెళ్లే మూల మలుపులో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మూల మలుపునకు ఇరువైపులా చెట్లు ఉండటం వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నాయి. రాత్రి సమయంలో ఈ రహదారిపై వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. వారంలో ఒకటి,రెండు ప్రమాదాలు జరుగుతుండడం సాధారణంగా మారింది. ఈ మూల మలుపు ప్రాంతంలో రోడ్డును వెడల్పు చేస్తే ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడుతాయని దీంతో ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ప్రతి రోజు కోఠి నుండి శ్రీరామ్‌కాలనీకి వెళ్లే బస్సులు ఎక్కువగా తిరుగుతాయి, అలాగే శ్రీరామ్‌కాలనీలో ఉన్న పరిశ్రమలకు భారీ కంటైనర్లు, ఇసుక లారీలు, ముఖ్యంగా షేరింగ్ ఆటోలు తిరుగుతాయి. గతంలో ఓ కంటైనర్ లారీ మూలమలుపునకు రాగానే ఎదురుగా వచ్చే వాహనం కనబడక పక్కనే ఉన్న కరెంట్ స్తంభానికి ఢీకొట్టడంతో కరెంటు పోలు కింద పడిపోయింది. అధికారులు ఇప్పటికి అక్కడ పోల్ ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. అధికారులు రోడ్డును సందర్శించి రహదారి విస్తరణ చేయాలని స్థానికులు, వాహనాదారులు కోరుకుంటున్నారు.



ముల మలుపులో ప్రమాదకరంగా వస్తున్న ఆర్టీసీ బస్సు



మధుబన్ కాలనీ నుంచి శ్రీరాంకాలనీకి వెళ్లే ప్రమాదకర మూల మలుపు

పట్టించుకోని అధికారులు



మధుబన్ కాలనీ నుంచి శ్రీరాంకాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరుగడానికి కారణమైన మూలమలుపు వద్ద రోడ్డును విస్తరణ చేస్తే సరిపోతుందని నా అభిప్రాయం. అధికారులు రహదారిని గుర్తించి ప్రమాదాలు జరుగకుండా చూడాలని కోరుతున్నాను.

– సామల సతీష్, స్థానిక వ్యాపారి

ప్రమాదాలు జరుగకుండా చూస్తాం



మధుబన్ కాలనీ నుంచి శ్రీరాం కాలనీకి వెళ్లే మార్గంలో మూల మలుపు ప్రమాదకరంగా ఉందని నా దృష్టికి వచ్చింది. తప్పనిసరిగా అక్కడికి వెళ్లి పరిశీలిస్తాం. స్థానికుల సూచనల మేరకు రహదారిపై ప్రమాదాలు జరుగకుండా చూస్తాం.

– నరేందర్‌గౌడ్, రాజేంద్రనగర్ సర్కిల్ ఈఈ



శంషాబాద్ లో ప్రమాదం జరిగిన కరాచీ బేకరీ పరిశ్రమ

గాయపడ్డ కార్మికుడిని ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

17న రిటైర్డ్ ఎంప్లాయీస్ పెన్షనర్స్‌డే

బండ్లగూడ: తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన పెన్షనర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కిస్మత్‌పూర్ శాఖ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్‌లోని పూర్ణా గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టీ.ప్రకాష్‌గౌడ్, కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిలు హాజరుకానున్నారన్నారు. ప్రతి సంవత్సరం కిస్మత్‌పూర్ శాఖ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్పొరేటర్లు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తాం



రోడ్డు మరమ్మత్తు పనులను పరిశీలిస్తున్న సురేష్‌గౌడ్

బండ్లగూడ: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ ధాత్రి వెంచర్ నుంచి సరస్వతీ విద్యాపీఠం మెయిన్ రోడ్డు వరకు డ్రైనేజీ పైపులైన్, రోడ్ల మరమ్మత్తు పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా ఈ రహదారి గోతులమయంగా మారి స్థానిక ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యను స్థానిక ప్రజలు తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే అధికారులతో మాట్లాడి మరమ్మత్తు పనులను చేయించడం జరిగిందన్నారు. కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా అభివృద్ధి పరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వరదకాలువకు అడ్డుగా ఉన్న ప్రహరీ కూల్చివేత



ప్రహరీలను జేసీబీతో కూల్చివేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

శంషాబాద్ రూరల్: వరదకాలువకు అడ్డుగా ఏర్పాటు చేసిన ప్రహరీని రెవెన్యూ అధికారులు గురువారం కూల్చివేశారు. మండలంలో కబ్జాలకు గురవుతున్న వరదకాలువల దుస్థితిపై ఈ నెల 14న సాక్షిలో ప్రచురితమైన 'కబ్జా కోరల్లో వరదకాలువలు' అనే కథనానికి అధికారులు స్పందించారు. రామంజాపూర్ శివారులో రియల్టర్లు వరద కాలువకు అడ్డుగా నిర్మించిన ప్రహరీని ఆర్ఐ సరిత ఆదేశాలతో జేసీబీతో కూల్చివేశారు. నీటి వనరులను కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.



రామంజాపూర్ శివారులో వరదకాలువకు అడ్డుగా ఉన్న ప్రహరీని కూల్చివేసిన అధికారులు

ఔటర్‌పై రోడ్డు ప్రమాదం

ఒకరి మృతి



శంషాబాద్ రూరల్: సిమెంట్ పైప్‌ల లోడుతో వెళ్తున్న వాహనాన్ని వెనక నుంచి డీసీఎం ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన సంఘటన ఔటర్ రింగ్ రోడ్డుపై గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీకి చెందిన డీసీఎం గురువారం మంఖాల్‌లోని ప్లాంట్ వద్ద సిమెంట్ పైపులను లోడ్ చేసుకుని శంషాబాద్ వైపు వస్తుంది. వాహనంపై వెనక నలుగురు కూలీలు కూర్చున్నారు. పెద్దగోల్కొండ శివారులో ఔటర్ రింగు రోడ్డుపై వెనక నుంచి వచ్చిన మరో డీసీఎం ఈ వాహనాన్ని బలంగా ఢీకొని బోల్తా పడింది. దీంతో సిమెంట్ పైపులు కింద పడిపోవడంతో అందులో కూర్చున్న సూరజ్ కుమార్(20) తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురు కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జాబ్‌మేళా

విజయనగర్‌కాలనీ: ప్రైవేటు సంస్థల్లోని 200 ఉద్యోగాల భర్తీకి శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ అధికారి నందిగామ మైత్రిప్రియ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో, జీడీఏ ప్రైవేటు లిమిటెడ్, అవాసా కన్సల్టెన్స్, డాన్‌బాస్కో నెట్‌వర్క్, బాస్కో సేవా కేంద్ర తదితర సంస్థలలోని ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండి 18 సంవత్సరాలు పైబడిన వారు అర్హులన్నారు. అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10 గంటలకు విజయనగర్‌కాలనీలోని హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో ఫోటోలు, సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావాలన్నారు. వివరాలకు 83284 28933 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



ఎమ్మెల్యే విజయోత్సవ సభలో పాల్గొన్న కాలనీ వాసులు

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధిని చూసి ప్రజలు నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించారని నియోజకవర్గం ఎమ్మెల్యే టీ. ప్రకాష్‌గౌడ్ అన్నారు. బుధవారం రాత్రి గణేష్‌నగర్‌లో కాలనీవాసులు ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ..నియజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడానికి అహర్నిశలు కృషి చేశానని, అందుకే ప్రజలు ఈసారి కూడ ఎమ్మెల్యేగా పట్టం కట్టారన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఆగకుండా చూస్తానని తెలిపారు. కాలనీలలో ఏదైన సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో గణేష్ నగర్ బీఆర్ఎస్ అధ్యక్షులు బాస శ్రీనివాస్, వివేక్, తిరుమల వెంకటేష్, గట్టయ్య, బుచ్చయ్య, ఏసు, అనంతంగుప్తా తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయు నాయకుల రాస్తారోకో

రాజేంద్రనగర్: పార్లమెంటుకు భద్రత కల్పించలేని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని ఎలా కాపాడుతుందని సీఐటీయు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజుల రుద్ర కుమార్ అన్నారు. రాజేంద్రనగర్ మండలం శివరాంపల్లి నేషనల్ పోలీసు అకాడమీ హైవే రోడ్డుపై గురువారం రాస్తారోకో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని సరైన మార్గంలో నడిపించే విధంగా దేశ భవిష్యత్తు కోసం నిధులు, నియామకాలు విధి విధానాలు చర్చించి సరైన దారిలో పెట్టే పార్లమెంటుకి భద్రత కరువైందన్నారు.ఈ దాడిని సీఐటీయు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు భద్రత వైఫల్యాలకు ఇది నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్ష్య సాధింపులు మానుకొని రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు రాజేంద్రనగర్ మండలం నాయకులు శ్రీకాంత్, గుండప్ప, నారాయణ, జగన్, అబ్దుల్ రహీం, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా ఉంటాం



విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

మణికొండ: పేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలలకు తమ వంతు అండగ నిలుస్తూ, అవసరమైన సౌకర్యాలను సమకూరుస్తామని వెరిట్రా ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజర్‌లు ఆచంట గోపినాథ్, మాసు బాలాజీరెడ్డిలు అన్నారు. గురువారం మణికొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవసరమైన 32 ఫ్యాన్లు, 1 ల్యాప్‌టాప్, 5 క్రికెట్ కిట్‌లు, షటిల్ బ్యాట్స్, 400 మ్యాజిక్ స్లేట్స్‌లాంటి అనేక వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం తల్లితండ్రుల ఆర్థిక పరిస్థితి వల్లే వారు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారన్నారు. అలాంటి వారికి కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో సౌకర్యాలను కల్పిస్తే వారు చదువుల్లో మరింత రాణిస్తారన్నారు. అలాంటి వారికి తమ సంస్థ అండగా ఉంటుందని, అన్ని రకాల సౌకర్యాలను రాబోయే రోజుల్లో కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాంగ్యానాయక్, నార్సింగి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, మణికొండ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, సంస్థ సిబ్బంది అనురాధ, శ్రీదేవి, శ్వేత, రాఘవేందర్‌లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలి



కోఠి డీఎంహెచ్ఎస్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సుల్తాన్‌బజార్: గతంలో సీఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన రెండవ ఏఎన్ఎం సమ్మె సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నర్సింహా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తెలంగాణ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సమ్మె కాలంలో డీహెచ్‌తో సెప్టెంబర్ 1న జరిగిన చర్చల్లో భాగంగా 2వ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించడంతో పాటు 100 శాతం గ్రాస్ శాలరీ ఇప్పించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నేటి వరకు ఆ కమిటీ సమావేశం కాలేదన్నారు. త్వరితగతిన సమావేశాన్ని ఏర్పాటు చేసి ఏఎన్ఎంలకు 100 శాతం గ్రాస్ శాలరీని ఇచ్చే విధంగా చొరవ చూపాలని కోరారు. ఈ సమస్యలపై నూతన ఆరోగ్యశాఖ మంత్రికి సమస్యలు నివేదిస్తామని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, శ్యామల, జయమ్మ, జ్యోతి, తస్వీర్ సుల్తానా, పద్మ, రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యేతో హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

గోల్కొండ: అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. కార్వాన్ హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం ఎమ్మెల్యేను కలిశారు. హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ కార్యాలయం సమీపంలో ప్రభుత్వ స్థలం ఉందని ఈ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వారు వినతిపత్రం సమర్పించారు. ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణం అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటుందని అసోసియేషన్ కార్యానిర్వాహక అధ్యక్షులు ముత్యాల భాస్కర్ ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులున్నారు. సందర్భంగా అసోసియేషన్ వారు ఎమ్మెల్యేను శాలువా కప్పి పూలమాలలు ఇచ్చి సన్మానించారు.

నూతన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించండి



ఇళ్లను పరిశీలిస్తున్న గోవర్ధన్ రెడ్డి

అత్తాపూర్: శిథిలావస్థకు చేరుకున్న గృహలను తొలగించి ఆ స్థానంలో ఇందిరమ్మ గృహలను నిర్మించాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మంగళవారం గోవర్ధన్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అత్తాపూర్ నడిబొడ్డున 30 సంవత్సరాల క్రితం అప్పటి సర్పంచ్ దివంగత కాంగ్రెస్ పార్టీ అధినేత కొండకల్ల కాంతారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో 200 కుటుంబాలకు 60 గజాల నుంచి 100 గజాల స్థలాల్లో గృహ నిర్మాణాలను చేపట్టారన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు జీవనోపాధి కోసం వివిధ పనులను చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు.ఈ ప్రాంతలో డ్రైనేజీ పొంగిపొర్లడంతో ప్రజలు దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిన వెంటనే ఇంటి స్థలంతో పాటు గృహ నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తామని ప్రజలకు వాగ్దానం ఇచ్చి ఉన్నారని గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు అత్తాపూర్ నడి బొడ్డున నివసిస్తున్న పేద ప్రజలకు గృహ నిర్మాణాలను మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తప్పులు లేకుండా ఓటర్ జాబితా రూపొందించాలి



డీసీ డీడీ నాయక్‌తో మాట్లాడుతున్న సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

చార్మినార్: బూత్ స్థాయి అధికారులు తప్పులు లేకుండా ఓటర్ జాబితాలను రూపొందించాలని చార్మినార్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంచార్జి కె.వెంకటేష్ సూచించారు. గురువారం చార్మినార్ సర్కిల్-9 డిప్యూటీ కమీషనర్ డీడీ నాయక్ ఆధ్వర్యంలో మొగల్‌పురాలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవన సముదాయంలోని కార్యాలయంలో ఓటర్ల జాబితా,సవరణ తదితర అంశాలపై జరిగిన సమావేశంలో ఆయన మరో కాంగ్రెస్ పార్టీ నాయకులు మూసా ఖాసీంతో కలిసి పాల్గొని పలు సూచనలు చేశారు.

యూ టర్న్‌ల వద్ద అక్రమ పార్కింగ్‌లు

గోల్కొండ: యూ టర్న్‌లు అక్రమ పార్కింగ్‌ల కారణంగా ఉపయోగంలోకి రాకుండాపోతున్నాయి. దీంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూ టర్న్‌లను ట్రాఫిక్ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాహనాదారులు ఆరోపిస్తున్నారు. టోలిచౌకీ, షాగౌస్ హోటల్, గెలాక్సీ సెంటర్, తూమ్స్ చౌరస్తా-షేక్‌పేట్ రోడ్డు తదితర ప్రాంతాలలో ప్రయాణికుల సౌకర్యం కోసం యూ టర్న్‌లు ఏర్పాటు చేశారు. అయితే అత్యంత రద్దీగా ఉండే టోలిచౌకీ షాగౌస్ హోటల్ ముందు ఉన్న యూ టర్న్ ప్రతి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గత కొంత కాలం క్రితం ప్రయోగాత్మకంగా ట్రాఫిక్ పోలీసులు ఈ యూటర్న్‌ను ప్రారంభించారు. అయితే రెండురోజుల్లోనే ఈ యూటర్న్ వద్ద తికమకకు గురికావడంతో మూసి వేశారు. మళ్లీ వారం తరువాత యూటర్న్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించారు. దీంతో వాహనాల యూటర్న్ తీసుకునే సమయంలో వెనుక నుంచి వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.



తూమ్స్ చౌరస్తా సమీపంలో అక్రమ పార్కింగ్‌లతో మూతపడ్డ యూ టర్న్.

- పాత ముంబాయి జాతీయ రహదారి గెలాక్సీ సెంటర్ వద్ద ఉన్న యూటర్న్ నిర్వహణను కూడా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. యూ టర్న్ తీసుకుంటున్న వాహనాల సంఖ్య ఎక్కువ ఉండడంతో ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయి.
- తూమ్స్ చౌరస్తా-షేక్‌పేట్ ప్రధాన రహదారిపై మసీదు ముందు ఉన్న యూ టర్న్‌లు అక్రమ పార్కింగ్‌లకు నిలయంగా మారింది. ఉదయం 8 నుంచి అర్ధరాత్రి వరకు ద్విచక్ర వాహనాలు, కార్లు ఈ యూటర్న్ వద్ద పార్కు చేసి ఉంటున్నాయి. గుల్షన్ కాలనీ నుంచి టోలిచౌకీ వెళ్లే వారు ఈ యూటర్న్ వద్దే మలుపు తీసుకుంటారు. అయితే కార్లు, ఆటోలు ఈ యూటర్న్ గూండా పోలేని పరిస్థితి ఉంది. యూటర్న్‌ల వద్ద ప్రమాదాలను నివారించడంతో పాటు అక్రమ పార్కింగ్‌లను నియంత్రించడానికి ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు.

చురుగ్గా సీవరేజ్ పైప్‌లైన్ పనులు



చార్మినార్: జలమండలి ఆధ్వర్యంలో దూద్‌బౌలీలో రూ.2.50 లక్షలతో కొత్తగా సీవరేజ్ పైప్ లైన్ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని మజ్లిస్ పార్టీ యువజన నాయకులు ఆర్.దీపేష్ రాజ్ వర్మ తెలిపారు. గురువారం దూద్‌బౌలీ క్రాస్ రోడ్డు నుంచి కింగ్ హోటల్ రోడ్డులో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ పర్యవేక్షణలో నూతనంగా రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున కొత్తగా ఈ సీవరేజ్ పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయన్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

రాయదుర్గం: ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా పనిచేస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడ సాయివైభవ్ కాలనీలో కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో కాలనీవాసులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం గాంధీ, శ్యామలాదేవి దంపతులను కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలుచోట్ల డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. సాయివైభవ్, సాయిఐశ్వర్య కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ, వరద నీటి సమస్య శాశ్వతప్రాతిపదికన తీర్చడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, కాలనీ కార్యదర్శి పద్మావతి, నాయకులు గణేష్‌ముదిరాజ్, నిహారిక, గ్రీన్ గ్రేస్, అపర్ణ వెస్ట్‌సైడ్, సాయిఐశ్వర్య కాలనీ, ఇతర గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ల ప్రతినిధులు, ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.